# కామ్రేడ్ భీమవరపు గురవారెడ్డి 3వ వర్థంతి సభ



**ప్రొద్దుటూరులో కా॥గురవారెడ్డి వర్థంతిసభలో నివాళులర్పిస్తున్న కా॥ఎస్.ఝాన్సి, తదితరులు**

**ప్రొద్దుటూరు, 3-11-2019:**

తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ కోశాధికారి, ప్రొద్దుటూరు గ్రామ మాజీ సర్పంచి అమరుడు కామ్రేడ్ భీమవరపు గురవారెడ్డి 3వ వర్థంతిసభ ప్రొద్దుటూరు గ్రామంలో ఆయన అమరస్థూపం వద్ద జరిగింది. ముందుగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥వీరబాబు అధ్యక్షతన అమరస్థూపంవద్ద ఎర్రజెండాను రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥ఎస్.ఝాన్సి ఎగురవేసి అమరులకు జోహార్లు తెలిపారు. అనంతరం కా॥గురవారెడ్డి స్మారక స్థూపానికి టిఎన్ ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు డా॥వై.సుధీర్‌రెడ్డి పూలదండతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలోఆళ్ళ సత్యనారాయణ రెడ్డి, రంగారెడ్డి, బంధువులు, స్నేహితులు, అభిమానులు, రైతుకూలీసంఘం నాయకులు పూలతో నివాళులు అర్పించి జోహార్లు తెలిపారు.

సభకు అధ్యక్షత వహించిన టిఎన్ ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు డా॥వై.సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ -2004 సం॥నుంచి కా॥ గురవారెడ్డిగారితో తనకున్న అనుబంధాన్ని వివరించారు. ట్రస్ట్ కోశాధికారిగా ట్రస్ట్ తరపున సాహిత్యాన్ని విస్తృతంగా ప్రచురించడంలో ఈయన కృషి ఆదర్శవంతమైనదని ఈ కృషిని ముందుకు తీసుకువెళ్తామన్నారు.

జనసాహితి రాష్ట్రకార్యదర్శి కా॥దివికుమార్ మాట్లాడుతూ కామ్రేడ్ గురవారెడ్డి గ్రామానికి మాత్రమే సర్పంచికాదని, ఈ గ్రామానికే తలలో నాలుకలా వున్నారని అందుచే గ్రామప్రజలు పైసా ఖర్చు చేయకుండానే సర్పంచిగా అభిమానంతో ఆయనను గెలిపించారని అన్నారు. రికార్డుల తనిఖీ పేరుతో ఏదో ఒక కేసులో ఇరికించి సర్పంచిగా తొలగించాలని ఆనాటి రాష్ట్రప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించకపోగా - ఆయన నిజాయితీని, క్రమశిక్షణను చూసిన అధికారులు అభినందించి వెళ్లారని గుర్తుచేశారు. ఈయనను ఆదర్శంగా తీసుకోవటమంటే ఈ వ్యవస్థతో పోరాటం చేయటమే, దానిని కొనసాగించటమేనన్నారు. ఆర్థికమాంద్యం ఏర్పడినదని, ఆటోమొబైల్‌రంగం దెబ్బతినటమే ఉదాహరణగా చూపుతున్న పాలకులకు గత 25 సం॥ల పైబడి వ్యవసాయ రంగం దెబ్బతిని, రైతులు ఆత్మహత్యలకు గురవుతుంటే, వ్యవసాయాధారిత పరిశ్రమలు మూతపడుతుంటే ఈ సంక్షోభం గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వీటికి వ్యతిరేకంగా ప్రజాఉద్యమాలను మరింత సంఘటితంగా ఐక్యంగా నిర్మించాల్సిన అవసర ముందన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర)రాష్ట్ర అధ్యక్షులు కా॥ఎస్.ఝాన్సీ మాట్లాడుతూ కమ్యూనిస్టుల త్యాగాలను స్మరించుకోవటంకోసం కా॥గురవారెడ్డి గారు తొలితరం అమరజీవుల స్మారకస్థూపాన్ని నిర్మించారన్నారు. యువతలో ప్రజాసంస్కృతిని, ప్రజావిలువలను పెంపొందించేందుకు ప్రచారం చేసారని గుర్తుచేశారు. తన ఆదాయంనుండే గ్రామ అభ్యుదయంకోసం, ఉద్యమాలకోసం, సర్పంచుల హక్కులకోసం పోరాటం చేయటానికి ఖర్చుచేశారని అన్నారు. కా॥గురవారెడ్డి సర్పంచిగా ప్రజాస్వామిక పద్ధతిలో ఐక్యపోరాటాలు నడిపి ఆదర్శంగా నిలిచాడని అన్నారు. టిఎన్ ట్రస్టు ముఖ్యబాధ్యునిగా కా॥టిఎన్ గురించి, ఆయన కృషిని వివరించే సాహిత్యాన్ని ప్రచురించడంలో ఎంతో శ్రమచేశారని అన్నారు. ఎంతకాలమైనా కా॥గురవారెడ్డిగారి కృషిని మనం గుర్తుంచు కోవాల్సివుందని అన్నారు.

'ఒకదేశం అభివృద్ధిగురించి ఆలోచించే టప్పుడు-వ్యవసాయం మీద ఆధారపడే రైతుల పరిస్థితి ఎలా వుంది? పారిశ్రామికరంగం అభివృద్ధి ఎలా వుందన్న దానిపైన, ప్రజల కొనుగోలు శక్తి, జీవన విధానం, సంస్కృతి మొదలగువాటిని పరిగణలోకి తీసుకోవాలి. రైతులు, కౌలురైతులు, కూలీలు, సామాన్య మధ్యతరగతి ప్రజలు, కార్మికుల ఆత్మహత్యలు నానాటికీ తీవ్రమవటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? దేశం వెలిగిపోతోందని అంటే అర్థం ఇదేనా? రైతుభరోసాలు, కిసాన్ పథకాలు ఆత్మహత్యలను ఆపలేకపోతున్నాయి. దీనికి గల కారణాలను, వాటి మూలాలను గురించి అందరూ ఆలోచించాల'ని ఆమె అన్నారు. సామ్రాజ్య వాదులతో చేసుకునే ఒప్పందాలను ప్రజలు, మేధావులు అర్థంచేసుకోవాలని, దీనికి వ్యతిరేకంగా మనం నిలబడి ప్రజలను, యువతను చైతన్య పరచాలని, దేశాన్ని రక్షించాలని, ఇదే గురవారెడ్డి జీవితం మనకు ఇచ్చే స్ఫూర్తి అని ముగించారు.

స్థూపనిర్మాణ కమిటి అధ్యక్షులు ఆళ్ళ సత్యనారాయణరెడ్డి, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, రంగారెడ్డి మాట్లాడారు. చివరగా టిఎన్ ట్రస్ట్ కోశాధికారి భీమవరపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ-పెద్దలు చనిపోతూ మన బాల్యాన్ని తీసుకుపోతారు అన్నమాట తమ విషయంలో అనుభవంలోకి వచ్చిందని అన్నారు. 'నాన్న, అక్కతాతయ్య, కృష్ణమూర్తిగారు అనేకమంది పెద్దలు వెళ్ళిపోతూ మనఅందరి బాల్యాన్ని తీసుకుపోయారు. మనం ఈ గ్రామ అభ్యుదయం కోసం బాధ్యత వహిస్తూ పెద్దలు చూపిన మార్గంలో ముందుకు సాగాల'ని అన్నారు.

స్థానికంగా ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. అనంతరం స్థానిక హైస్కూల్ విద్యార్థులు చేసిన నృత్య రూపకం, అలాగే సభకు ముందునుంచి ప్రజాకళాకారులు ఆలపించిన విప్లవగేయాలు సభికులను ఉత్తేజపరిచాయి.

ooo